నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 హైదరాబాద్, శుక్రవారం 19 జనవరి 2024 HYDERABAD




రోటరీ అవార్డుల ప్రదానం ▸ సామాజిక సేవలో విశేష కృషి చేసిన మహిళలకు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్, అనిల్ రాంచందానీ తదితరులు



క్యాలెండర్ ఆవిష్కరణ ▸ డీజీపీ కార్యాలయంలో గురువారం ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ రవిగుప్తా తదితరులు

### 2 గంటలు మించితే

## అధికారులకు మెమోలు

**మరమ్మతులతోనే కరెంట్ కోతలు**

**ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

సిటీబ్యూరో, జనవరి18 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో రోజూ 2 గంటలు.. కరెంట్ కోతలు అంటూ వచ్చిన వార్తలపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. వేసవిలో అధిక డిమాండ్ నేపథ్యంలో భాగంగానే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు సీఎండీతో పాటు సంబంధిత ఉన్నతాధికారులతో సమస్యపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు మరమ్మతు పనుల షెడ్యూల్‌ను రూపొందించారని తెలిపారు. జనవరి 17 నుంచి ఫిబ్రవరి 10 వరకు 15 నిమిషాల నుంచి 2 గంటల లోపు నిర్వహణ పనులు పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రెండు గంటలకు మించి కరెంట్ పోతే అధికారులకు మెమోలు తప్పవని తెలిపారు. ఈ నిర్వహణ పనులు గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని వివిధ సబ్ స్టేషన్ల పరిధిలో రొటేషన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జంటనగరాల్లో 11 కేవీ సామర్థ్యం కలిగిన 2400 ఫీడర్లున్నాయని.. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో మరమ్మతులు చేపట్టే వారని.. ఎన్నికల కారణంగా జనవరిలో మరమ్మతులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజు 100 ఫీడర్స్ పరిధిలో కేవలం రెండు గంటల లోపు మాత్రమే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నమస్తే ఎఫెక్ట్

## ఆందోళన వద్దు

**తాగునీటికి కటకట ఉండదు**

**నమస్తే కథనానికి స్పందించిన మంత్రి పొన్నం**

**కృష్ణా జలాలపై భయందోళన అవసరం లేదు**

**సాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం 520.8 అడుగులు**



సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : నగరానికి కృష్ణా జలాల సరఫరాలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వేసవిలోనూ నిరంతరాయంగా నీటి సరఫరా అందిస్తామని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో తాగునీటికి కటకట అంటూ వచ్చిన 'నమస్తే తెలంగాణ' కథనంపై మంత్రి పొన్నం స్పందించారు. ప్రస్తుతం కృష్ణ తాగునీటి సరఫరా వ్యవస్థపై ఎలాంటి భయందోళనలు అవసరం లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లలో 33.62 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని, భవిష్యత్తులో జలమండలికి నెలకు 1.40 టీఎంసీల చొప్పున 10 టీఎంసీల నీరు వినియోగించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సాగర్‌లో 520.8 అడుగుల నీటిమట్టం ఉందని, నీటి నిల్వలు 510 అడుగుల మేర కొనసాగించాలని ఇప్పటికే ఇరిగేషన్ ఈఎన్సీకి లేఖ రాశామని, ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో పరిస్థితిని సమీక్షిస్తున్నామని వెల్లడించారు. 2017 సంవత్సరంలో చేసిన మాదిరిగానే ఈ సారి అత్యవసర పంపింగ్ కోసం టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కృష్ణా మూడు దశల్లో 270 ఎంజీడీల నీరు అందిస్తామని, కృష్ణా జలాల తరలింపులో ఎలాంటి భయాందోళన అక్కర్లేదని జలమండలి అధికారులు స్పష్టం చేశారు.





బేగంపేట్ విమానాశ్రయంలో గురువారం జరిగిన ఏవియేషన్ షోలో విమానాలు



ఏవియేషన్ షోకు హాజరైన విదేశీ మహిళ



ఆకాశంలో హెలీకాప్టర్ల విన్యాసాలు

## వింగ్స్ ఇండియా అదుర్స్

**బేగంపేట్ విమానాశ్రయంలో ఏవియేషన్ షో**

కంటోన్మెంట్, జనవరి 18 : వింగ్స్ ఇండియా-2024షో గురువారం ఘనంగా ప్రారంభమైంది. బేగంపేట్ విమానాశ్రయంలో ఈ ఏవియేషన్ షోను కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే లాస్యనందిత, ఏవియేషన్ రంగ నిపుణులు, పలువురు అధికారులు, దేశ విదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

GHMC

## ఎక్స్‌టెన్షన్‌లో 46 మంది!

**ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్**

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా ఇప్పటికీ ఉద్యోగాల్లో కొనసాగుతున్న ఉద్యోగుల జాబితాను జీహెచ్‌ఎంసీ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి జోన్లతో పాటు సంస్థ ప్రధాన కార్యాలయాలలో రిటైరయ్యాక కూడా పలు హోదాల్లో కొనసాగుతున్న అధికారులపై కమిషనర్ రొనాల్డ్ రాస్ శాఖల వారీగా నివేదిక తెప్పించుకున్నారు. మొత్తం 46 మంది వరకు ఉన్నట్లు తేల్చిన అధికారులు ఈ నివేదికను గురువారం ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిసింది. అయితే జోనల్ కార్యాలయాల నుంచి వాస్తవాలు బయటకు రాలేదని, నివేదిక తూతూ మంత్రంగా తయారు చేసినట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. కమిషనర్ పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే రిటైర్ ఉద్యోగుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.



### ఉచిత మెగా ప్లాస్టిక్

## సర్జరీ క్యాంప్

**ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 5 వరకు**

జూబ్లీహిల్స్, జనవరి18 : మెర్సీ మిషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ల్యాండ్స్, రాంకీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 5 వరకు ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. నగరంలోని ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్‌లో పక్షం రోజుల పాటు గ్రహణం మొర్రి, కాలిన గాయాలతో అవయవాలకు వచ్చిన వంకర్లు సరిచేయడం, జన్యుపర లోపంతో శరీరంపై వచ్చిన అవాంఛిత రోమాల నివారణకు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు మువ్వ రాంరెడ్డి, విద్యాభూషణ్, డాక్టర్ భవానీ ప్రసాద్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ గులాబి రాణి, గద్దె భాస్కర్ తెలిపారు. వివరాలకు 78160 79234, 98482 41640 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



### • చేనేత సంత.. మగువ పులకింత

క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యసాయి నిగమంలో గురువారం చేనేత పట్టు ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించిన ప్రముఖ గాయని లక్ష్మి గాయత్రి వేదాంతం. దేశంలోని 14 నగరాల నుంచి వచ్చిన చేనేత కారులు 50 రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచిన ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 24 వరకు కొనసాగనుంది.

- సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ)



### • 28న ఇనార్బిట్ దుర్గంచెరువు రన్

ఇనార్బిట్ మాల్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్కు, వెస్టిన్ హోటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహిస్తున్న ఇనార్బిట్ దుర్గంచెరువు రన్(4వ ఎడిషన్ రన్) కోసం ప్రత్యేకంగా రూపొందించిన జెర్సీని గురువారం ఆవిష్కరిస్తున్న మాదాపూర్ డీసీపీ జీ.వినీత్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, ఉమెన్ సేఫ్టీ డీసీపీ సృజన, కే రహేజా కార్ప్ తెలంగాణ, ఆంధ్రల ప్రతినిధి శ్రవణ్ గోనే తదితరులు

- కొండాపూర్, జనవరి 18



కార్వాన్ నియోజకవర్గంలో నాలా పనులు పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

## నాలా పనులు పూర్తి చేయండి

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ ) : నాలా అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌తో కలిసి సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నదీమ్ కాలనీ, షా హతీం కాలనీలలో ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలించారు. సాలార్ బ్రిడ్జి జంక్షన్ అభివృద్ధి, మిలిటరీ బౌండరీ సీవరేజ్ పైపులైన్ పనులను పూర్తి చేయాలన్నారు. సాలార్ జంగ్ కాలనీలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. జియాగూడ స్లాటర్ హౌజ్‌తో పాటు కార్వాన్ సర్కిల్‌లోని ఆదిత్యనగర్ పార్కు, హకీంపేట్, సాలార్ బ్రిడ్జి, టొలిచౌకి, సాలార్ జంగ్ కాలనీ, బంజరు దర్వాజ, నానల్ నగర్, జియాగూడ కాలనీలలో పర్యటించి శానిటేషన్, స్మార్ట్ వాటర్ డ్రైనేజీ, నాలా పనులు పరిశీలించారు. కమిషనర్ వెంట ఈఎన్సీ జియావుద్దీన్, జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలివ్వండి

**బిల్లులు చెల్లిస్తేనే పనులు చేస్తాం**

**జీహెచ్‌ఎంసీకి కాంట్రాక్టర్ల అల్టిమేటం**

**ఇందిరాపార్క్ వద్ద ధర్నా**

**రోజుకో రీతిలో నిరసనలు**

**అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం**

సిటీబ్యూరో/కవాడిగూడ, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీతో కాంట్రాక్టర్లు పోరుకు సిద్ధమయ్యారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే పనులు జరుపుతామని అల్టిమేటం జారీ చేశారు. కమిషనర్ రొనాల్డ్ రాస్, అదనపు కమిషనర్ కెనడీ వైఖరితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బిల్లులు చెల్లించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే జోనల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, వినతిపత్రాలు సమర్పించి, రోజుకో రీతిలో నిరసనలు తెలుపుతున్న కాంట్రాక్టర్లు గురువారం ఏకంగా ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లు సాయి కిరణ్, భాస్కర్ రావు, ఆర్. హనుమంత్ సాగర్, పి.శ్రీశైలం, జి. శ్రీనివాస్‌రెడ్డి, ముజీబ్, శంకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో రూ. 1200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు 700 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వక్తం చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని వారు హెచ్చరించారు. గడిచిన కొన్ని రోజులుగా కాంట్రాక్టర్ల ధర్నాతో అభివృద్ధి పనులు పూర్తి నిలిచిపోయాయి.



ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో ధర్నా చేపడుతున్న జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లు


### బిల్లులు రాక రోడ్డున పడ్డాం



జీహెచ్‌ఎంసీ బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నో మార్లు మొరపెట్టుకున్నాం. అయినా అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. సివిల్, ఎస్ఎన్‌డీపీ, సీఆర్‌ఎంపీలకు సమానంగా పేమెంట్లు ఇవ్వాలి. బిల్లులు అందక రోడ్డున పడ్డాం.

**- జి.శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు, జీహెచ్‌ఎంసీ అల్వాల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్**

### పనులు నిలిపేస్తాం



ఎన్నికల కోడ్ ఉన్నందున బిల్లులు చెల్లించ లేదు. నూతన ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. లేకుంటే పనులు నిలిపేస్తాం. పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

**- ఎస్.హనుమంత్ సాగర్, అధ్యక్షుడు, కాప్రా సర్కిల్ కాంట్రాక్టర్స్ యూనియన్**